జ్ఞాపకాల దొంతరలోని మధురానుభూతిని హరించివేస్తూ పల్లవి కలత నిద్రలోనించి మేల్కొంది. తుళ్ళింతతో గబగబ లేచి వెళ్ళి టైము చూసింది.

'అమ్మయ్య' అని గుండెల మీద చేతులుంచుకుని నిట్టూర్చింది.

ఆద మరచి నిద్రపోతే తెల్లారాక అందరి ముందు దోషిలా తలవంచుకోవలసి వస్తుంది. అందుకే ఈ జాగరణ.




అలసిసొలసి ఉన్న శరీరానికి హాయిగా తనివితీరా నిద్రించే అవకాశం లేదు కదా! నిద్రపోకుండా ఎంత మేల్కొని ఉండాలని ప్రయత్నించినా సాధ్యం కావటం లేదు.

కన్ను మూస్తే— ఆ తరువాత ఎంత తిట్టుకున్నా ప్రయోజనం ఉండదు.

రెండు రోజుల నుంచి ఎంతగా ఎదురు చూస్తోంది ఏ క్షణంలో వస్తుందోనని. ఎన్ని ఇబ్బందుల పాలైంది.

తెల్లవారు జామున లేచింది మొదలు ప్రతి నిముషం అదిలేని కొరత కొట్టొచ్చినట్లు కళ్ళ ముందు కదలాడుతూనే వుంది.

తనసలు ఏ రాత్రి సుఖంగా— తృప్తిగా నిద్రపోయిందని.

అమ్మవాళ్ళు చెప్పిన వాడిని చేసుకుంటే ఈ బాధలు తప్పేవిగా!

అమ్మానాన్నా ఎంతగా చెప్పారు. అన్న— అక్క ఎంత బ్రతిమాలారు. వాళ్ళ హెచ్చరికలు తన చెవికెక్కితే కదా! అయినా తను వినిందా!

తన బుద్ధి గడ్డితిని తనలా ఆనాడు మంకు పట్టు పట్టి కూర్చోబట్టి కాదు—

ఈ రోజిలా అవస్థలు పడాల్సి వస్తోంది.

ఇంట్లో అందరి కనీస అవసరాలు తీరటానికి ఎంత పొదుపుగా వాడినా ఇంకా ఇబ్బందిని ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తూనే వుంది.

"అమ్మా! నాకు ఇంకోసారి కావాలే!" అని నోరు తెరచి అడిగినా పసివాళ్ళని చూస్తుంటే తన ప్రాణం తరుక్కుపోతూంది.

ఈ లోపు— ఎవరైనా బంధువులు వస్తే తన పాట్లు ఆ బ్రహ్మకెరుక. పగలంతా ఆఫీసులో అలసిపోయి వస్తారు కదా అని ఆయనిబ్బంది పెట్టలేక ఆ బాధలు తానే పడుతుంది పల్లవి.

చిన్నతనంలో ఎంత హాయిగా గడిపేసింది రోజులు.

పచ్చని పైరుల మధ్య.

స్వచ్ఛమైన చల్లని గాలుల మధ్య.

పల్లెటూరైతే మాత్రమేం... కొబ్బరి నీళ్ళలాంటి ...ఆ ఊరి బావి నీరు తాగి కడుపు నింపుకోవచ్చు.

జీవితం గురించి ఎన్ని ఆశల తోరణాలల్లింది.

మరెన్ని మధురోహలు నింపుకుంది.

ఏవి! ఆ తీయని రోజులు.

తన జీవితమంతా ఇలా ఎదురు చూపులతో ఎప్పుడొస్తుందీ అని ఎదురు చూస్తూ— తెల్లవార్లూ కలత నిద్రలో...

పగలంతా రాత్రి నిద్రలేని కారణంగా నీరసంతో నిముక్కుంటూ... హోం గోవర్ తో బాధ పడుతూ గడపవలసిందేనా!

జీవితంలో ఎన్ని ఉన్నా ఆ ఒక్కటే లేకపోతే.

ఏం సుఖం!

'అబ్బ... ఎప్పుడు ఈ ఆలోచనలొకటి నా ప్రాణానికి.

"టైమెంతయిందో—" అని లేచి వెళ్ళి టైము చూసింది.

"ఇంకా అరగంట ఉంది" అని పక్క మీద వాలింది.

పక్క మంచం మీద పిల్లలిద్దరూ ఆదమరచి నిద్రపోతున్నారు.

బాల్యం మనిషికి ఓ వరం. ఎంత తీయనివి ఆ రోజులు. మళ్ళీ జ్ఞాపకాల దొంతరల మధ్య కూరుకుపోయిన పల్లవికి గభాల్న మెలకువ వచ్చింది.

పది మంది గలగల మాటలు, బిందెల చప్పుళ్ళు... గోలగోలగా వినిపించటంతో "అమ్మో నీళ్ళొచ్చేసి నయ్" అనుకుంటూ నిద్రకళ్ళతో అర్ధరాత్రి వేళ తలుపు తీసి బయటకు వచ్చింది పల్లవి.

ఆంధ్రాలో ప్రసిద్ధి గాంచిన ఆ పట్టణంలో కాపురముండాలని ఒకప్పుడు కలలుగన్నా ఆ కళ్ళు—

ఇప్పుడు... నిద్రలేమితో ఎర్రగా జ్యోతుల్లా ఉన్నాయి.